


# కథ

ఎ.రాజరాజేశ్వరి

# పాప కావాలి

నిండు గెలవేసిన అరటిచెట్టు బరువుతో ముందుకు వంగినట్లుగా, ఏడవ నెలలోనే భారంగా నడుస్తున్న సునీత వైపు జాలిగా చూశాడు శ్రీకాంత్. అందుకే అంటారు అపురూపమైనది ఆడజన్మ! ఇంకో ప్రాణిని సృష్టించడానికి తన ప్రాణాలు పణంగా పెట్టి మరీ మాతృదేవతగా మారుతుంది.

ఆమె కడుపులో కవలపిల్లలున్నారని డాక్టరు చెప్పిన పుటి నుండీ ఆమెకి ఏ కష్టం కలగకుండా ఉల్లాసంగా ఉంచుతూ, తన శాయశక్తులా సంతోషపెడుతున్నాడు.

భర్త తననింత అపురూపంగా చూసుకుంటున్నా సునీత మనసులో యిదీ.. అని చెప్పలేని దిగులు తొంగి చూస్తోంది. అతడు అడిగిన కోరికను ఎలా తీర్చాలో అర్థంకాక సతమతమవుతోంది. తన చేతుల్లో వున్నద యితే అతడి ముచ్చట తీర్చగలిగేది. దేనికయినా భగవంతుని కృప ఉండాలి అనుకుంది చిన్నగా నిట్టూరుస్తూ.

తను నెల తప్పిందని తెలిసిన రోజున, ఇంద్రలోకాన్ని జయించినంత సంబరంగా తనని దగ్గరకు తీసుకున్నాడు.

"నన్ను నిరాశపరచకుండా అందమైన పాపని కని స్తావు కదూ!" తన చుబుకాన్ని పట్టుకొని గోముగా అడుగుతున్న అతడి మాటలకు తనలో కొంటెతనం తొంగి చూసింది.

"మీరు దాత.. నేను గ్రహీత! దానం కొద్దీ బిడ్డలు అని మీకు తెలుసుగా! నా చేతుల్లో ఉన్న విషయమయితే మీకు మాటివ్వగలను" తన మాటలు రుచించనట్టు మొహం చిన్నబుచ్చుకున్నాడు.

"నాకు మా అమ్మంటే ప్రాణం. ఆవిడ అవసాన దశలో నా దుఃఖం చూడలేక నాకు మాటిచ్చింది. 'ఏడవకు నాన్నా! కొన్నాళ్లే నీకు దూరంగా ఉండేది. దేవుడితో పోట్లాడి మరీ నీ దగ్గరకొచ్చేసి, నీ చేతుల్లో నీ బిడ్డగా పెరుగుతాను' అంది. మా అమ్మ నాకు మళ్లీ కావాలి. నన్ను చాలా అపురూపంగా పెంచిన మా అమ్మని, నా బిడ్డగా అంతకంటే బాగా పెంచి ఆవిడ ఋణం తీర్చుకుంటాను" ఎమోషనల్‌గా అంటున్న అతడిని ఓదార్పుగా దగ్గరకు తీసుకుంది.

తన కడుపులోని కవలలు ఎవరన్నదీ.. గోప్యంగానే ఉండిపోయింది. లింగ నిర్ధారణ నేరం కాబట్టీ డాక్టరు నవ్వుతూనే దాటేసింది. "చెరకు గడని కడ వరకు నమిలితేనే దాని రుచి, తీపి తెలిసేది. అలాగే బిడ్డల గురించీ సస్పెన్సు తొలగిపోతే మజా ఉండదు. వెయిట్ అండ్ సీ..." అంది.

"ఒకరు అమ్మాయి, అబ్బాయి పుడితే చాలింక. మీ అమ్మాయిని మీకిచ్చేసి, నా కొడుకుని నేను పెంచుకుంటాను" అంది శ్రీకాంత్‌ని ఆట పట్టిస్తూ.

ఆమె అల్లరికి నెత్తిన చిన్నగా మొట్టాడు. "ఇద్దరూ అమ్మాయిలయితే?" అన్నాడు ఉడికిస్తూ.

"నాకేం ఫర్వాలేదు. ఎవరయినా ఒకటే! మరి అబ్బాయిలే పుడితే... మీ సంగతో!" అంటూ గంభీరంగా మారిపోయిన అతడి మొహం చూసి నాలిక్కరుక్కుంది.

ఎదురుచూసిన క్షణాలు రానే వచ్చాయి. లేబర్ రూమ్‌లో సునీత నొప్పులు పడుతుంటే, శ్రీకాంత్ అస్థిమితంగా శుభవార్త కోసం పచార్లు చేయసాగాడు.

"కవలలిద్దరూ అబ్బాయిలు" అని నర్స్ తెచ్చిన వార్తకి అతడి నడక మందగించి నిరాశగా కుర్చీలో చతికిలపడ్డాడు.

ఆడపిల్ల పుట్టిందని, భార్యని హింసించే వాళ్లని, వదిలేసిన వారి గురించీ విన్నాం. ఒకే కాన్పులో మగపిల్లలు పుట్టినందుకు సంతోషించక, డీలాపడిన అల్లుడి మొహం చూసి ఆశ్చర్యపోతూ "రండి శ్రీకాంత్! పిల్లలను చూద్దాం" అన్న మామగారి మాటలకు మౌనంగా లోపలకి దారి తీశాడు.

కవలలిద్దరూ ఎర్ర కలువల్లా ఉన్నారు. చీకటి కుహరంలో నుండీ ఒక్కసారిగా వెలుతురులోకి వచ్చేసరికి, కళ్లు చికిలిస్తూ ఆహారం కోసం అప్పుడే అన్వేషణ మొదలయిందన్నట్టు నోరు తెరచి పాల కోసం కాళ్లు, చేతులు కదిలిస్తూ తడుముకోసాగారు. నోటికి ఏమీ దొరక్కపోవడంతో, తమ వేళ్లనే చప్పరించసాగారు.

ఆరోగ్యంగా ఉన్న ఆ పిల్లలిద్దరినీ చూడగానే శ్రీకాంత్‌లోని పితృప్రేమ పరవళ్లు తొక్కింది. పాప కావాలన్న కోరికను తాత్కాలికంగా మరచిపోయి, పిల్లలను చూసుకొని మురిసిపోతున్న అతడిని చూసి అంతా తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

డబుల్ ధమాకా అన్న మురిపెం వారిని పెంచడంలో ఎంత కష్టం దాగి ఉందో తెలిసి రాసాగింది. ఇద్దరూ ఏది చేసినా జాయింటుగా చేస్తారు. ఏడుపు, ఆకలి, ఆటలు అన్నీ ఒక్కసారే.

మూడు సంవత్సరాలు ఇట్టే తిరిగిపోయి, పిల్లలు స్కూలుకెళ్లే వయసు రావడంతో స్కూలులో జాయిన్ చేశారు.

చిత్రంగా.. పిల్లలు తల్లి దగ్గరకన్నా, తండ్రితోనే ఎక్కువ చనువుగా ఉండి గారాలుపోతారు. అతడు ఆఫీసు నుండీ రాగానే, స్కూల్లో టీచర్ నేర్పించిందంతా పోటీలు పడి మరీ.. తండ్రి దగ్గర తమ పాండిత్యాన్ని ప్రదర్శిస్తారు.

పిల్లలను చూసి వారి తెలివికి శ్రీకాంత్ మురిసిపోతే, సునీత ఉడుక్కుంటుంది. "మీరు కూతురి పార్టీ కదా! ఇదేంటి మరి! నన్ను పట్టించుకోవడం మానేసి, పిల్లలను మచ్చిక చేసుకుంటున్నారు" అంది బుంగమూతి పెడుతూ.


"ఏం చేయమంటావు? దేవత కరుణించింది కానీ, భక్తుడి కోరిక కాదని, వేరే వరం ఇచ్చి, దాంతోనే తృప్తిపడమనేసరికి, నా మానసపుత్రికను వీరిలోనే చూసుకుంటున్నాను" అతడి గొంతులోని అసంతృప్తిని గమనించిన ఆమె, నెమ్మదిగా అక్కడి నుండీ జారుకుంది.

జీవితం ఒక గాడిలో పడి సునీతకి హాయిగా ఉంది. పిల్లలు కూడా ఎటువంటి పేచీలు పెట్టక ఆటలు కానీ, చదువు గానీ వాళ్లల్లో వాళ్లే చూసుకుంటారు. లేదా తండ్రి దగ్గర గారాలుపోతారు. భర్త మనసులోని కోరికను సఫలీకృతం కావాలని ఆశిస్తోంది.

"శ్రీకాంత్ ఒకసారి టూ టౌన్ పోలీసు స్టేషన్‌కి వస్తావా! నీ పిల్లలు మా దగ్గరున్నారు" అంటూ తన క్లోజ్ ఫ్రెండ్ ఎ.సి.పి. కిరణ్ నుండీ ఫోన్ రావడంతో అతడి గుండె జారిపోయింది. స్కూలుకెళ్లిన పిల్లలు అక్కడికెలా చేరారో అర్థం కాక, ఆఫీసులోని పని అలాగే వదిలేసి ఉరుకులు, పరుగులతో వచ్చాడు.

అతడు భయపడినట్లుగా కాక, పిల్లలిద్దరూ ఫైవ్ స్టార్ చాకొలేట్‌లు తింటూ, పోలీసులతో కబుర్లు చెబుతూ ఆడుతున్నారు.

"ఏంటిరా! కొంపలంటుకుపోయినట్లు నా పని చెడగొట్టి మరీ పిలిపించావు. సంగతి తెలియక చాలా భయపడ్డాను. ఇంతకీ వీళ్లిక్కడికెలా వచ్చారు?" అన్నాడు



కాస్త ఆశ్చర్యంగా.

కిరణ్ కొంటెగా నవ్వాడు. "సంగతి చెప్పి నిన్ను రమ్మంటే, కచ్చితంగా నువ్వు రాకపోగా పిల్లలు ఇంటికి చేరడానికి మా పి.సి.లనో, మా చెల్లినో ఆశ్రయించేవాడివి. నిన్ను చూసి చాలా రోజులయింది అందుకే ఈ వంకతో రప్పించాను"

"నన్ను చూడడానికి పిల్లలను ఇక్కడికి ఎత్తుకొచ్చావా?" శ్రీకాంత్ ప్రశ్నకి కిరణ్ గలగలా నవ్వాడు.

"అదేం లేదు లేరా! మీ ఆటోవాడు ఎంతకీ రాలేదని ఈ గడుగ్గాయిలు గేటు కీపర్ కళ్లు కప్పి ఇంటిదారి పట్టారు. కాస్త దూరం నడిచి ఎటు వెళ్లాలో తెలీక దిక్కులు చూస్తుంటే మా ట్రాఫిక్ కానిస్టేబుల్ వాళ్లని ఇక్కడికి తెచ్చి అప్పజెప్పాడు. వాళ్ల డైరీలో అడ్రెస్ చూస్తే నీ సుపుత్రులని తెలిసింది.. అదీ సంగతి!" అన్నాడు.

ఏదో అనబోతున్న శ్రీకాంత్ ఎవరిదో చంటిపిల్ల ఏడుపు వినపడినట్లయి, చటుక్కున ఆగిపోయి చెవులు రిక్కించి విన్నాడు.

"ఎవరా పసిబిడ్డ! ఏడుపు వినిపిస్తోంది!" కుతూహలంగా అడుగుతున్న మిత్రుడి ప్రశ్నకి కిరణ్ దీర్ఘంగా నిట్టూర్చాడు.

"నిన్న రాత్రి ఎవరో దంపతులను రాంగ్ సైడులో వచ్చిన వ్యాన్ గుద్దేసింది. భార్యాభర్తలు స్పాట్‌లోనే పోతే, ఈ పాప మాత్రం అమాంతం ఎగిరి పడి, పక్కనే ఉన్న పూల దుకాణంలోని బుట్టలో పడింది. చిన్న గాయం కూడా కాకుండా అనూహ్యంగా ప్రాణాలు దక్కించుకుంది. చాలా గట్టి పిండం! ఈ పిల్లను మాత్రం బ్రతికించడంలోని అంతరార్థం ఆ దేవుడికే తెలియాలి. ఇంత చిన్న వయసులో తల్లితండ్రులను పోగొట్టుకున్న ఆ జీవితం ఎలా గడుస్తుందో! ఎన్ని మలుపులు తిరుగుతుందో" అంటూ జాలిగా నిట్టూర్చాడు.

శ్రీకాంత్ మనసు కలచినట్లయింది.

"పాపం! ఇంత చిన్న వయసులో ఎంత కష్టం వచ్చింది. మరి పోయిన వాళ్లు ఎవరు? వారి తాలూకు బంధువులు ఎక్కడున్నారో ఎంక్వైరీ చేయించలేదా?"

"అతడి పర్సులోని అడ్రస్‌ని

బట్టి ఎంక్వైరీ చేస్తే, ఇరుగు పొరుగులు చెప్పినదేమిటంటే వాళ్లీ ఊరొచ్చి నెల రోజులే అయిందట. ఎవరికీ ఏమీ తెలీదన్నారు. ఒకావిడ మాత్రం ఇచ్చిన ఇన్ఫర్మేషన్ ఏమిటంటే, పెద్దలకిష్టం లేకుండా ప్రేమ వివాహం చేసుకోవడం వలన ఎవరితోనూ సంబంధ బాంధవ్యాలు, రాకపోకలు లేవన్నారుట. అతడు పనిచేసే ఆఫీసులో కూడా అతడి గురించీ ఎవరూ ఏమీ చెప్పలేకపోయారు"

శ్రీకాంత్ లేచి పాప దగ్గరకెళ్లాడు. వత్తయిన ఉంగరాల జుట్టు, గుండ్రటి కళ్లు, పాల బుగ్గలతో చాలా బొద్దుగా, ముద్దుగా ఉంది. అంతవరకూ గుక్కపట్టి ఏడుస్తున్న పాప, శ్రీకాంత్‌ని చూడగానే మీటనొక్కినట్లు ఏడుపాపేసి, ఎత్తుకోమన్నట్లు చేతులందిస్తూ బోసి నవ్వులు కురిపించసాగింది. నిన్నటి నుండీ సరయిన సంరక్షణ లేక వాడిన కమలంలా ఉంది.

శ్రీకాంత్ అప్రయత్నంగా చేతులు చాచి, ఆ పాపను తన చేతుల్లోకి తీసుకొని నుదురు చుంబించి, గుండెలకదుముకున్నాడు. ఆ స్పర్శ శ్రీకాంత్‌లో ఏదో తెలియని మమత, మమకారాన్ని కలిగిస్తే, పాప కిలకిలా నవ్వుతూ ఆడసాగింది.

ఇదంతా గమనిస్తున్న పిసిలు ఆశ్చర్యపోయారు. "ఇక్కడికి వచ్చినప్పటి నుండీ ఎవరో కొట్టినట్టు ఏడుస్తూ, ఎంత సముదాయించినా వినక మా బుర్రలు పనిచేయకుండా చేస్తోంది. మిమ్మల్ని చూసి తండ్రనుకుంది కాబోలు. నిశ్చింతగా ఆడుతోంది" అన్నారు.

అంతవరకూ ఊగిసలాడుతున్న అతడి ఆలోచనలు వారి మాటలకు ఒక కొలిక్కి వచ్చినట్లయింది. పాపను జాగ్రత్తగా ఊయలలో పడుకోపెడుతుంటే, నన్నొదిలి వెళ్లొద్దన్నట్టు అతడి వేలిని పట్టుకుంది. విడిపించుకొని వెళుతున్న అతడి వైపే చూస్తూ సన్నగా ఏడుపు మొదలెట్టింది.

"పాప పరిస్థితేమిటి? ఏం చేస్తారామెను" అన్నాడు శ్రీకాంత్ వచ్చి కూర్చుంటూ.

"ఏముంది? ఏదయినా అనాథాశ్రమంలో అప్పజెప్పి, ఎవరయినా పెంచుకోవాలని ముందుకొస్తే, లీగల్‌గా దత్తత ఏర్పాట్లు జరగడానికి సహకరిస్తాం"

శ్రీకాంత్ కళ్లు మెరిశాయి. "ఎవరో ఎందుకు...? నేనే దత్తత స్వీకరిస్తాను. నీకు తెలుసుగా. నాకు ఇద్దరూ మగపిల్లలే. ఆడ పిల్లంటే నాకు అమితమైన వాత్సల్యం. ఎలాగయినా సరే నాకు ఆ పాప కావాలి" అన్నాడు ఉద్విగ్నంగా.

"చాలా మంచి నిర్ణయం తీసుకున్నావు. ఒక అనాథ పిల్లకు జీవితాన్నివ్వాలనుకోవడం చాలా గొప్ప విషయం. అయినా మా చెల్లెమ్మని కూడా ఒకసారి అడిగి చూడు. ఈ విషయం ఆమెకి కూడా నచ్చాలి కదా! పోషించేది నువ్వయినా, పెంచేది ఆవిడే మరి"

కిరణ్ మాటల్లోని వాస్తవానికి తలపంకించిన శ్రీకాంత్ సునీతకి ఫోను చేసి, తామున్న చోటుకి ఒకసారి రమ్మని చెప్పడంతో, విషయం తెలియని ఆమె చాలా కంగారుగా వచ్చింది.

కులాసాగా కబుర్లు చెబుతున్న భర్తని, పిల్లలను చూసి స్థిమిత పడ్డ ఆమె, "ఇదేమన్నా పిక్నిక్ స్పాటా? అర్జెంటుగా బయలుదేరి రమ్మంటే ఏమయిందోనని హడలిపోయాను" అంది చిరుకోపంగా.

"ఏం చెయ్యను? నా అన్వేషణ, కోరిక ఫలించి, ఇన్నాళ్లకు మా అమ్మ దొరికింది. మరి ఆవిడని అత్తగారిగా అభిమానిస్తావో, అమ్మవై లాలిస్తావో నీ ఇష్టం!" అన్నాడు దాగని చిరునవ్వుతో.

అయోమయంగా చూస్తున్న ఆమెను పాప దగ్గరకు తీసుకెళ్లాడు. "ఈ పాపను మనం పెంచుకుందాం! నీకు నచ్చిందా? లేక ఏమయినా అభ్యంతరమా? దయచేసి కాదనవు కదూ! నాకీ పాప కావాలి ప్లీజ్!"

వెన్నెల నవ్వులు కురిపిస్తున్న పాప బుగ్గని ముద్దాడింది సునీత. "మరి మనం ఈ పాపను పెంచుకోవాలంటే, ముగ్గురు పిల్లలవుతారు. అత్తయ్య మీ బిడ్డగా పుడితే నాలుగో బిడ్డకి మనం న్యాయం చేయగలమా?"

సునీత సందేహం అర్థమైన అతడు ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

"అమ్మ నా కడుపున పుడతానని చెప్పలేదు. నా దగ్గరకొచ్చి నా చేతుల్లో నా బిడ్డగా పెరుగుతానంది. అమ్మ నా కోసం ఈ పాప రూపంలో వచ్చిందనిపిస్తోంది. ఎలాగయినా ఈ పాపని పెంచుకుందాం" చంటిపిల్లాడిలా మారాం చేస్తున్న అతడి వైపు చిరునవ్వుతో చూసింది.

ఆటలాడి అలసిపోయిన పిల్లలు ఇంటికెళదాం అని గొడవ మొదలు పెట్టేసరికి, సునీత పాపను తెచ్చి వారికి చూపించింది.

"ఏరా.. చెల్లి బాగుందా? మనింటికి తీసుకెళదామా?" అంది.

"కావాలి.. కావాలి" అన్నారు ఆతృతగా. కేరింతలు కొడుతున్న పాపని చూసి భలే..భలే అంటూ సంబరంగా చప్పట్లు కొట్టారు.

"మా అందరికీ పాప కావాలన్నయ్యా! దీనికి సంబంధించిన ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసి, చట్ట ప్రకారం దత్తత స్వీకారం జరిగే వరకూ పాపని మా దగ్గరే ఉంచుకుంటాం" అంది పాపను గుండెకు హత్తుకుంటూ.


కిరణ్ అందుకు గ్రీన్ సిగ్నలివ్వడంతో అంతా బయలుదేరారు. కార్లో కూర్చున్నాక అప్పుడు గుర్తొచ్చింది సునీతకి. "రేపు చెప్తాను. ఆటోవాడి పని, పిల్లలను ఇంటి దగ్గర దింపకుండా గాలికొదిలేస్తాడా" అంది కోపంగా.

శ్రీకాంత్ అనునయంగా భార్య భుజం తట్టాడు. "నీకు కోపం రావడంలో అర్థముంది. పిల్లలు బయటికి రాకుండా చూడడం గేటు కీపర్ డ్యూటీ. అతని నిర్లక్ష్యం గురించీ రేపు ప్రిన్సిపాల్‌కి కంప్లయింటిద్దాంలే. నువ్వు ఆటో డ్రైవర్‌ని ఏమీ అనక వంద రూపాయలిచ్చి పంపించు. అతడు రాకపోనందునే కదా ఈ బంగారు తల్లి నాకు దొరికి, పాప కావాలన్న నా చిరకాల వాంఛ తీర్చింది" అన్నాడు పాపను కంటినిండా చూసుకుంటూ.

సునీత అతడి మాటలకు విస్మయపడింది. "బాగుంది మీ ఉదార బుద్ధి. చెప్పకుండా మానేసినందుకు మందలించక పైపెచ్చు వంద రూపాయలియ్యాలా! ఇదేదో బాగానే ఉందనుకుని ఇదే పునరావృతం చేస్తాడు" అని గొణుక్కుంటున్న సునీత మాటలను పట్టించుకోకుండా, కారును ముందుకు ఉరికించాడు పొంగిపొర్లుతున్న సంతోషంతో.

భవిష్యత్తు గురించీ బెంగలేని పాప సునీత ఒడిలో నిశ్చింతగా ఆడసాగింది.

○



# సంగీత కుటుంబం

ఆస్కార్ విజేత ఎ.ఆర్.రెహమాన్ 'కపుల్స్ రిట్రీట్' అనే హాలీవుడ్ సినిమాకి సంగీతాన్ని అందిస్తున్నాడు. కామెడీ ఇతివృత్తంగా సాగే ఈ సినిమాలో ఓ పాటని రెహమాన్ ఆరేళ్ల కొడుకు 'అలీమ్' పాడడం విశేషం. సింగర్ కావాలని తెగ ఆరాటపడుతున్న తన కుమారుడి కోరికను పాట పాడించడం ద్వారా నెరవేర్చేందుకు సిద్ధమయ్యాడన్నమాట రెహమాన్. అయితే ఈ పాటను అలీమ్ చాలా బాగా పాడాడని అంటున్నారు విన్నవాళ్లంతా. రెహమాన్ కొడుకా మజాకా?